

మెరీనా బీచ్‌లోని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



డీఎంకే ఎంపీ కనిమొళిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఉదయనిధి

డిప్యూటీ సీఎం పదవి కాదు.. బాధ్యత!

● ఉదయనిధి స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ముఖ్యమంత్రి అనేది పదవి కాదని బాధ్యత అని, తనపై విశ్వాసం ఉంచి ఇంతటి బరువైన బాధ్యతను అప్పగించిన సీఎం స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఉదయనిధి అన్నారు. ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన సందర్భంగా ఆయన ఆదివారం ఉదయం మెరీనా బీచ్‌లోని అన్నాదురై, కరుణానిధి సమాధులపై పుష్పవలయాలు ఉంచి నివాళులర్పించారు. ఆ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ... పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా పదవిని చేపట్టినప్పుడు, ఆ తర్వాత మంత్రిగా నియమించినప్పుడు ప్రతి పక్షాలు తనపై తీవ్ర విమర్శలు చేశాయన్నారు. తనకిచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి విమర్శించిన వారిని విస్తుపోయేలా చేశానన్నారు. ఇదే తరహాలో ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టడంపై కూడా తీవ్ర విమర్శలు వస్తున్నాయని, వాటితో పాటు ప్రశంసలను కూడా సమానంగా భావించి తనకిచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు.

సినీ రంగం నుంచి డిప్యూటీ సీఎం దాకా...

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి 1977 నవంబర్ 27న జన్మించారు. లయోలా కాలేజీలో బీకాం చదివారు. ఆయనకు భార్య కృత్తిక, కుమారుడు ఇన్బన్, కుమార్తె తన్మయ ఉన్నారు. విజయ్, త్రిష నటించిన 'కురువి' చిత్ర నిర్మాతగా ఉదయనిధి సినీరంగ ప్రవేశం చేశారు. ఇక గౌతంమేనన్ దర్శకత్వం వహించిన 'విన్నైతాండి వరువాయా' చిత్రానికి ఆయన డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత 'మదరాస పట్టినం', 'బాస్ ఎన్‌గిర భాస్కరన్', 'మైనా', 'కో', 'డాన్', 'విక్రమ్' చిత్రాలకు నిర్మాతగా, పంపిణీదారుగా పనిచేశారు. 2009లో సూర్యా నటించిన 'ఆదవన్' చిత్రంలో ఉదయనిధి చేసిన గెస్ట్‌రోల్ తమిళ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తరువాత 2012లో 'ఒరు కల్ ఒరు కన్నాడి' చిత్రం ద్వారా ఉదయనిధి తమిళ చిత్రసీమకు హీరోగా పరిచయమయ్యారు. ఆ చిత్రం సూపర్‌హిట్ అయ్యింది. ఆపై 'ఇదు కదిర్‌వేలన్ కాదల్', 'నన్బేన్‌డా', 'గెత్తు', 'మనిదన్', 'శరవణన్ ఇరుక్క భయమేన్', 'పొదువాగ ఎన్ మనసు తంగమ్', 'ఇప్పడై వెల్లుమ్' 'నిమిర్', 'కన్నే కలై మానే', 'సైకో', 'కన్నై నంబాదే', 'ఏంజల్', 'నెంజుక్కు నీది' తదితర చిత్రాల్లో నటించారు. సినిమాలపై ఆసక్తిగా నటిస్తూ వచ్చిన ఉదయనిధి 2018 మార్చిలో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో, 2022 శాసనసభ ఉప ఎన్నికల్లోనూ డీఎంక కూటమి తరపున ప్రచారం చేశారు. 2019 జూలై 7న డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2021లో చేపాక్ - ట్రిప్లికేన్ నియోజకవర్గంలో పోటీ చేసి శాసనసభ్యుడిగా గెలిచారు. 2022 డిసెంబర్‌లో మంత్రివర్గ మార్పుల సందర్భంగా ఆయన్ను యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రిగా నియమితులయ్యారు. చిత్రసీమలో చురుకుగా పనిచేసిన ఉదయనిధి 2023లో హాస్యనటుడు వడివేల్‌తో 'మామన్నన్'లో హీరోగా నటించారు. ఆ చిత్రంతో తన సినీప్రస్థానానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. రాజకీయాలపై దృష్టి సారించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకే కూటమి అభ్యర్థుల తరఫున ఉదయనిధి రాష్ట్రవ్యాప్తంగా చేసిన ప్రచారం ఓట్లవర్షం కురిపించింది. అప్పటి నుంచి ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాలంటూ పార్టీ సీనియర్ నాయకులు, మంత్రుల నుంచి సీఎం స్టాలిన్‌పై ఒత్తిళ్లు అధికమయ్యాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా తన తండ్రి కరుణానిధి బాటలోనే తనయుడిపై అపారమైన ప్రేమాభిమానాలను ప్రదర్శించి ఉప ముఖ్యమంత్రిగా నియమించారు.

మూడో ఉప ముఖ్యమంత్రిగా...

రాష్ట్రానికి మూడో ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2006-11 సంవత్సరాలలో కరుణాధి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనారోగ్యానికి గురికావటంతో అప్పట్లో పురపాలక శాఖ మంత్రిగా ఉన్న తనయుడు ఎంకే స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టారు. 2009 మే 29 నుంచి 2011 మే వరకు డీఎంకే పాలన కొనసాగినంతవరకూ స్టాలిన్ ఆ పదవిలోనే కొనసాగారు. ఆ తర్వాత రాష్ట్రానికి రెండో ఉపముఖ్యమంత్రిగా ఓ.పన్నీర్‌సెల్వం పదవిని చేపట్టారు. 2017లో ఎడప్పాడి పళనిస్వామి సీఎంగా ఉన్నప్పుడు ఆయన డిప్యూటీ సీఎం అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్న తన తనయుడు ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. దీనితో స్టాలిన్ ప్రతిపాదనను అంగీకరించి గవర్నర్ ఆర్‌ఎన్ రవి జారీ చేసిన ఆదేశాల మేరకు రాష్ట్రానికి మూడో ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఉపముఖ్యమంత్రి పదవితోపాటు ఆయన అదనంగా ప్రణాళిక, అభివృద్ధి శాఖలను నిర్వర్తించనున్నారు.

సెంథిల్‌బాలాజీ సహా నలుగురు మంత్రుల ప్రమాణ స్వీకారం



కొత్త మంత్రులు సెంథిల్‌బాలాజీ, ఆర్.రాజేంద్రన్, ఎస్ఎం నాజర్, గోవి చెళియన్ చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగదు అక్రమ బట్వాడా కేసులో యేడాదికి పైగా జైలు వాసం గడిపి మూడు రోజుల ముందు బెయిలుపై విడుదలైన కరూరు ఎమ్మెల్యే సెంథిల్‌బాలాజి మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు మరో ముగ్గురు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో అట్టహాసంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఈ నలుగురి చేత గవర్నర్ ఆర్ ఎన్ రవి ప్రమాణస్వీకారం చేయించారు. సీఎం స్టాలిన్ తన మంత్రివర్గంలో స్వల్పమార్పులు జరిపారు. ఆ మేరకు మంత్రులు సెంజి మస్తాన్, రామచంద్రన్, మనో తంగరాజ్‌ని తొలగించారు. సెంథిల్‌బాలాజి సహా నలుగురికి మంత్రివర్గంలో స్థానం కల్పించడం, ఆరుగురు మంత్రుల శాఖల మార్పు సహా యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధిని ఉప ముఖ్యమంత్రిగా నియమించాలంటూ గవర్నర్‌కు సిఫారసు చేశారు. ఆ ప్రతిపాదనలను ఆమోదించినట్లు గవర్నర్ అధికారిక ప్రకటన చేశారు. ఈ మేరకు రాజ్‌భవన్ భారతీయార్ మండపంలో నలుగురు కొత్తమంత్రులకు ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత సేలం నార్త్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్.రాజేంద్రన్ చేత గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈయనకు పర్యాటక మంత్రిత్వ శాఖ కేటాయించారు. ఆ తర్వాత కరూరు ఎమ్మెల్యే సెంథిల్‌బాలాజీ, తిరువిడైమరుదూరు ఎమ్మెల్యే డాక్టర్ గోవి చెళియన్, ఆవడి ఎమ్మెల్యే ఎస్ఎం నాజర్ తమిళంలో ప్రమాణం చేశారు. ఆ తర్వాత ఈ నలుగురూ గవర్నర్ రవికి, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పుష్పగుచ్చాలను అందించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం కొత్త మంత్రుల పేర్లను ప్రకటిం చారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మంత్రులంతా గవర్నర్ రవి, సీఎం స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో గ్రూపు ఫొటో దిగారు. ఈ వేడుకలకు స్పీకర్ అప్పావు, దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీఐ నేత తిరుమావళవన్, ఎడీఎంకే నేత వైగో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీపీఐ నేత ముత్తరసన్, వేల్‌మురుగన్, జవాహిరుల్లా తదితర డీఎంకే మిత్రపక్షాల నాయకులు, డీఎంకే ఎంపీలు, శాసనసభ్యులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం చేయించడానికి భారతీయార్ హాలుకు విచ్చేసిన గవర్నర్ రవిని సీఎం స్టాలిన్ శాలువతో సత్కరించారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని పరిచయం చేసినప్పుడు గవర్నర్ రవి నవ్వుతూ ఆయనతో కరచాలనం చేశారు. స్టాలిన్ సతీమణి దుర్గాస్టాలిన్, ఉదయనిధి సతీమణి కృత్తిక, ఎంపీలు దయానిధి మారన్, టీఆర్‌బాలు ముందువరుసలో కూర్చున్నారు.

నలుగురికి శాఖల కేటాయింపు..

కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన నలుగురు మంత్రులకు శాఖలను కేటాయిస్తూ గవర్నర్ రవి ఓ ప్రకటన జారీ చేశారు. ఆ ప్రకారం వ సెంథిల్‌బాలాజీకి విద్యుత్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలను కేటాయించారు. డాక్టర్ గోవి చెళియన్‌కు ఉన్నతవిద్యా, సాంకేతిక విద్య, ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు, ఆర్.రాజేంద్రన్‌కు టూరిజం, చెరకు అభివృద్ధి శాఖల్ని, ఆవడి ఎస్ఎం నాజర్‌కు మైనార్టీల సంక్షేమం, ప్రవాస తమిళుల సంక్షేమం, వక్ఫ్‌బోర్డు శాఖలను కేటాయించారు. ఈ ప్రమాణ స్వీకారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమై పావు గంటలోపున ముగిసింది.

రామచంద్రన్‌కు ప్రభుత్వ విప్ పదవి



చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంత్రివర్గ మార్పుల్లో పదవిని కోల్పోయిన నీలగిరి జిల్లాకు చెందిన కే రామచంద్రన్ ప్రభుత్వ విప్‌గా నియమితులయ్యారు. పడుగర్ కులానికి చెందిన రామచంద్రన్‌ను మంత్రి పదవిని అప్పగించినప్పటి నుంచీ ఆ జిల్లాలో పార్టీ నేతల నుంచి తీవ్ర వ్యతిరేకతలను ఎదుర్కొంటూ వచ్చారు. పార్టీ జిల్లా శాఖ నేతలంతా రామచంద్రన్‌ను మంత్రి పదవిని నుంచి తొలగించాలంటూ కొద్ది నెలలుగా పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. ఆ నేపథ్యంలోనే రామచంద్రన్‌ను మంత్రి వర్గం నుంచి తొలగించినట్లు చెబుతున్నారు.

వక్ఫ్ బోర్డు చట్టసవరణ ముస్లిం సంస్థల అభిప్రాయాలు తీసుకోరా?

● రాష్ట్రప్రభుత్వంపై ఈపీఎస్ సీరియస్

పెరంబూర్, సెప్టెంబరు 29: వక్ఫ్ బోర్డు చట్ట సవరణ సందర్భంగా ముస్లిం సంస్థల అభిప్రాయాలు సేకరించని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. కేంద్ర ప్రభుత్వం గత పార్లమెంటు సమావేశాల్లో వక్ఫ్ బోర్డు చట్టాల్లో పలు సవరణలు చేసిందన్నారు. ఆ సవరణలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించిందన్నారు. ఆ కమిటీ అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తూ ముస్లిం సంస్థలను సంప్రదించి వారి అభిప్రాయాలు సేకరిస్తోందన్నారు. ఆ క్రమంలో, సోమవారం ఈ కమిటీ రాష్ట్రంలో పర్యటించనుందని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు డీఎంకే ప్రభుత్వ మైనార్టీ, బీసీ సంక్షేమ శాఖ చేపట్టిందనే వార్తలు వస్తున్నాయన్నారు. ఆ సమావేశానికి తమకు అనుకూలమైన కొన్ని ముస్లిం సంస్థల ప్రతినిధులను మాత్రమే డీఎంకే ప్రభుత్వం ఆహ్వానించిందనే విమర్శలున్నాయన్నారు. ఆ సమావేశానికి ఎస్డీపీఐ, ఐక్య ముస్లిం మున్నేట్ర కళగం, జమాత్ ఇస్లామీయ ఇంద్, దేశీయ ముస్లిం లీగ్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా, మనిదనేయ జననాయగ కట్చి సహా పలు సంస్థలకు ఆహ్వానం అందలేదని తెలిసిందన్నారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణను అన్నాడీఎంకే వ్యతిరేకిస్తుందన్నారు. ఆ చట్ట సవరణ ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులకు వ్యతిరేకంగా ఉందని, అందువల్ల ఈ చట్ట సవరణ వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. జేపీసీ పాల్గొనే అభిప్రాయ సేకరణ సమావేశానికి ముస్లిం సంస్థలను ఆహ్వానించకపోవడం ముస్లిం ప్రజలకు డీఎంకే ప్రభుత్వం చేస్తున్న ద్రోహమని, ఈ చర్యలను తాము ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా డీఎంకే ప్రభుత్వం స్పందించి, ముస్లిం సంస్థల ప్రతినిధులందరూ ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయలు తెలియజేసేలా చర్యలు చేపట్టాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

మదురై టీచర్ శుభశ్రీకి ప్రధాని మోదీ ప్రశంస



చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఔషధ మొక్కలను పెంచుతున్న ఉపాధ్యాయురాలు శుభశ్రీని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... ఎంతటి దుఃఖాలు ఎదురైనా సహనం పాటించేవారు చాలా అరుదు అని, అలాంటి వారిలో శుభశ్రీ ఒకరని పేర్కొన్నారు. శుభశ్రీ ప్రస్తుతం ఔషధ మొక్కలతో ఓ తోటను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, తన తండ్రిని పాము కరచినప్పుడు మూలికల మందు ఆయనను కాపాడటంతో ఆమె ఔషధ మొక్కల పెంపకంపై ఆసక్తి పెంచుకుందన్నారు. మదురై వెరిచ్చియూరు గ్రామంలో 500కు పైగా ఔషధ మొక్కలు పెంచుతున్నారని, కరోనా వ్యాప్తి కాలంలో రోగనిరోధక మూలికలను ప్రజలకు పంపిణీ చేశారన్నారు. ఆ ఔషధ మొక్కల వనాన్ని చూడటానికి సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివెళ్తున్నారని చెప్పారు. శుభశ్రీకి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుకుంటున్నానని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

నవరసాలను పండించడంలో జానపదాలకు సాటిలేదు

చిగిచెర్ల కృష్ణారెడ్డి



డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కందనూరు మధు, జేకే రెడ్డి

వేళచ్చేరి, సెప్టెంబరు 29: నవరసాలను పండించడంలో జానపదాలకు సాటిలేదని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి అన్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక టి.నగర్‌లోని ఆంధ్రా క్లబ్ కృష్ణా హాలు వేదికగా జరిగిన తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 153వ ప్రసంగంగా 'జానపద భాషా వైభవము' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైంది. సాహిత్యాభిమానులైన శ్రోతలందరికీ వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతం పలికారు. వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి ప్రార్థనా గీతం ఆలపించారు. వక్త కృష్ణారెడ్డిని జేకే రెడ్డి సభకు పరిచయం చేశారు. కృష్ణారెడ్డి 15 పుస్తకాలు, 61 పరిశోధన వ్యాసాలు రచించారని, 66 మంది ఎంఫిల్ స్కాలర్లకు, 35 మంది పీహెచ్‌డీ స్కాలర్లకు మార్గదర్శకం చేశారన్నారు. ఆయన ఆధ్వర్యంలో 2000 జానపద కళా ప్రదర్శనలు జరిగాయన్నారు. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం, జానపద కళారత్న మొదలైన అవార్డులు అందుకున్నారని తెలిపారు. కార్యనిర్వాహకులు వక్తను జ్ఞాపికతో, శాలువతో సత్కరించారు.

సమయానికి తగినట్లు పాడడమే జానపదం

జానపద పాటలు, సామెతలు మొదలైనవన్నీ కలసి జానపద విజ్ఞానం, ఫోక్‌లోర్ అంటారని వక్త కృష్ణారెడ్డి తెలిపారు. అక్షర జ్ఞానం లేని వాడు సమయానికి తగినట్లు పాడిన పాటలు తరతరాలుగా వ్యాప్తి చెంది అదే జానపద విజ్ఞానమైందన్నారు. నవరస భావాలకు జానపదుల పాటలు అద్దం పడతాయని, పాటకు తగిన రసం, భాష, భావం జానపద పాటల్లో వ్యక్తమవుతాయని అన్నారు. 'అత్తలేని కోడలుత్తమురాలు, కోడలు లేని అత్త గుణవంతురాలు', 'కోడల కోడల కొడుకు పెళ్లామా' మొదలైన జానపద పాటలు పాడుతూ భాషా వైభవాన్ని వర్ణించారు. నన్నయ నానారుచిర్థా సూక్తినిధిత్వము, ప్రసన్న కథాకవితార్థయుక్తి జానపద కళల్లో కనిపిస్తాయని తెలుపుతూ కొన్ని కథలను పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని జానపద కళారూపాలను తెలిపి వాటిల్లోని భాషా వైభవాన్ని వర్ణించారు. చిత్తూరు జిల్లాలో ద్రౌపది ఉత్సవాలు నిర్వహిస్తారని, అక్కడ ప్రదర్శించే వీధి నాటకాలు ప్రసిద్ధికెక్కాయని చెబుతూ, వీధి నాటకాలలోని జానపద భాషా వైభవాన్ని వివరించారు. కడపలో చెక్క భజనలు ప్రసిద్ధి అని, అక్కడ జడకోలాటం మొదలైన జానపద కళారూపాలు ప్రదర్శిస్తారన్నారు. అనంతపురం జిల్లాలోని కోలాటం గురించి వివరించి కొన్ని పాటలు పాడి వాటిలోని భాషా వైశిష్ట్యాన్ని తెలిపారు. అలవోకగా పాడిన జానపదాలలో రసానికి తగినట్లు, సందర్భానికి తగినట్లు భాష ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. చివరగా వక్త తాను రచించిన జానపద గేయాన్ని పాడి వినిపించారు. కందనూరు మధు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



సభకు విచ్చేసిన తెలుగుసాహితీ అభిమానులు, నగర ప్రముఖులు

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పమ్మల్ పరిధిలోని గ్రిగరి వీధి, పమ్మల్ మెయిన్ రోడ్డు, మసూరన్ వీధి, ధైవనాయకన్ వీధి, బాలాజి నగర్ 12 క్రాస్ వీధులు, పసుమ్‌పొన్ నగర్, బాలాజి నగర్ 30 అడుగుల రోడ్డు, బాలాజి నగర్ 12వ క్రాస్ వీధి, తిరునగర్, లక్ష్మీ నగర్, ఎల్లార్ రాజమాణిక్యం రోడ్డు, దేవదాస్ నగర్, రాఘవేంద్ర రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు పేర్కొంది.

రేపు చెన్నైకి రానున్న గుజరాత్ వరదల్లో చిక్కుకున్న తమిళులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: గుజరాత్ రాష్ట్రం మాలేశ్రీ నదిలో వరదల్లో చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన 26 మంది అక్టోబరు 1న మంగళవారం చెన్నైకి తిరిగి రానున్నారు. రాష్ట్రానికి చెందిన 26 మంది గుజరాత్ భావ్‌నగర్‌కు తీర్థయాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకొని తిరిగొచ్చేటప్పుడు ఈనెల 26వ తేది వరదల్లో చిక్కుకున్నారు. వారిని రాష్ట్రానికి తీసుకురావాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. దీంతో, అధికారులు గుజరాత్ రాష్ట్ర అధికారులను సంప్రదించి వారిని చెన్నైకి పంపించే ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. భావ్‌నగర్‌లో బసచేసిన వారు మంగళవారం రైలు ద్వారా చెన్నై సెంట్రల్ చేరనున్నారు. అక్కడి నుంచి వారు స్వగ్రామాలకు వెళ్లేలా వాహన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

పదోన్నతి పొందిన నావికాదళం ఐజీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: చెన్నైని కేంద్రంగా కలిగిన భారత నౌకాదళం తూర్పు ప్రాంతీయ కమాండర్‌గా ఉన్న ఐజీ డోని మైఖేల్ అదనపు ప్రధాన డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆయన విశాఖపట్టణం కేంద్రంగా ఆంధ్ర, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలున్న తూర్పు, ఈశాన్య మండల నావికాదళం కమాండర్‌గా బాధ్యతలు వహించనున్నారు.

తిరువణ్ణామలై, కరూర్‌లో మినీ టైడల్ పార్కులకు టెండర్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: తిరువణ్ణామలై, కరూర్‌లలో సమాచార సాంకేతిక శాఖకు సంబంధించిన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మినీ టైడల్ పార్కుల ఏర్పాటుకు టైడల్ పార్క్ సంస్థ టెండర్లు ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ, స్థానికంగా ఆర్థికాధారం పెంచేందుకు నగరాల్లో 50,000 నుంచి లక్ష చదరపు అడుగుల మినీ టైడల్ పార్కులు ఏర్పాటుచేస్తున్నారు. తిరువణ్ణామలై, కరూర్ జిల్లాల్లో తలా 50,000 చ.అ మినీ టైడల్ పార్కులు నిర్మిస్తున్నారు. ఈ పనులు చేపట్టేందుకు వివిధ సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో ఉన్న ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఇక్కడ తలా 600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. ఈ విద్యుత్ చెన్నై సహా శివారు ప్రాంతాల అవసరాలు తీరుస్తోంది. ఈ నేపథ్యంలో, శనివారం అర్ధరాత్రి మొదటి యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కావడంతో ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

రోడ్ల తవ్వడంపై నిషేధం

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: ఈశాన్య రుతుపవన వర్షాల కారణంగా రోడ్లను తవ్వే పనులకు సోమవారం నుంచి కార్పొరేషన్ నిషేధించింది. కార్పొరేషన్ పరధిలోని బస్సు మార్గాలు, అంతర్ రోడ్లలో వివిధ శాఖలు రోడ్లలో గుంతలు తవ్వి పనులు చేపడుతున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, సోమవారం నుంచి అన్ని రోడ్లలో తవ్వకాలు చేపట్టవద్దని కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది.

కుక్కలు పట్టే ఉద్యోగులకు టీకాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: నగరంలో కుక్కలు పట్టే ఉద్యోగులు 215 మందికి రాబీస్ నిరోధక టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. కార్పొరేషన్ ప్రాంతాల్లో రాబీస్ వ్యాధికి గురైన కుక్కలు పట్టే ఉద్యోగులు, వెటర్నరీ సిబ్బంది భద్రత కోసం వారికి టీకాలు వేసే శిబిరం రిప్పన్ బిల్డింగ్‌లో శనివారం జరిగింది. ఇందులో 215 మంది ఉద్యోగులకు టీకాలు వేయడంతో పాటు యూనిఫాం, షూస్, గ్లోవ్స్ వంటివి అధికారులు అందజేశారు.

వృద్ధుల ఆస్పత్రిలో రూ.900కు గదులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: స్థానిక గిండి వృద్ధుల సంక్షేమ ఆసుపత్రిలో రూ.900కు ప్రీ పెయిడ్ గదులు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆస్పత్రిలో ఒప్పంద పద్ధతిలో నియమితులైన 43 మందికి శనివారం ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫిబ్రవరి 20వ తేది ప్రారంభించిన ఈ ఆస్పత్రిలో అవుట్ పేషంట్లుగా 1.12 లక్షల మంది, ఇన్‌పేషంట్లుగా 3,267 మంది చికిత్స పొందారని తెలిపారు. 200 పడకల సౌకర్యం, అత్యవసర చికిత్స విభాగంలో 400 పడకల సౌకర్యం కల్పించామన్నారు. రూ.900 ఛార్జీలో ప్రీ పెయిడ్ ధరలను ఏర్పాటు చేశామన్నారు.

పూండి నుంచి పుళల్‌కు నీటి విడుదల

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: పూండి జలాశయం నుంచి పుళల్ జలాశయానికి నీరు విడుదలైంది. చెన్నై తాగునీటి ఆధారాల్లో ఒకటైన తిరువళ్లూర్ జిల్లా పూండి సత్యమూర్తి రిజర్వాయర్ 3.23 టీఎంసీల సామర్థ్యం కలిగి ఉంది. కృష్ణా నది జలాల ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి ఈనెల 19వ తేది సెకనుకు 500 ఘనపుటడుగుల వంతున నీరు విడుదలైంది. కండలేరు డ్యాం నుంచి సాయిగంగ కాలువ మీదుగా 22వ తేది రాష్ట్ర సరిహద్దు ఊత్తుకోట జీరో పాయింట్‌కు చేరుకున్నాయి. మరుసటిరోజు పూండి జలాశయానికి వచ్చి చేరాయి. ఈ నేపథ్యంలో, రెండు రోజులుగా తిరువళ్లూర్ జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పూండి నుంచి పుళల్ జలాశయానికి 150 ఘనపుటడుగుల వంతున నీరు విడుదల చేస్తున్నారు.

1.5 కిలోల గంజాయితో యువకుడి అరెస్ట్

వేలూరు, సెప్టెంబరు 29: స్థానిక కాట్పాడి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కాట్పాడి డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆనందన్ నేతృత్వంలో పోలీసులు చిత్తూరు బస్టాండ్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. కాట్పాడి సేవూరు రౌండ్ టేబుల్ ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ అని తెలుసుకున్న పోలీసులు, అతని బ్యాగులో 1,500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

మహిళా విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

● టీటీడీ చెన్నై ఎల్‌ఓసీ మాజీ ఛైర్మన్ శ్రీకృష్ణ

ప్యారీస్, సెప్టెంబరు 29: మహిళా విద్యతోనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని టీటీడీ చెన్నై స్థానిక సలహా మండలి (ఎల్‌ఓసీ) మాజీ ఛైర్మన్ ఎస్.శ్రీకృష్ణ తెలిపారు. జార్జిటౌన్ ఆదియప్పన్ నాయకన్ వీధిలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అండ్ చారిటీస్ (ఎస్కేపీడీ) నిర్వహణలోని శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఎయిర్ కండిషన్ ఆడిటోరియం ప్రారంభోత్సవం ఆదివారం వాసవి మాత ప్రత్యేక పూజలతో ఘనంగా జరిగింది. గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ అతిథులను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఆయన స్వాగతోపన్యాసం చేస్తూ... ఎస్కేపీడీ ఆధ్వర్యంలో విద్య, సామాజిక, ఆధ్యాత్మిక సేవలను అంకితభావంతో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు, ప్రొఫెసర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా ఈక్విటాస్ బ్యాంక్ అధికారి జాన్‌అలెక్స్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహనశ్రీ వ్యాఖ్యాతగా వ్యవహరించి ఎస్కేపీడీ ట్రస్ట్ సేవలను సభలో వివరించారు.



ప్రముఖ ఆడిటర్ శ్రీకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయకరిసల్‌కుళంలో బంగారు నాణెం లభ్యం



ఐసిఎఫ్, సెప్టెంబరు 29: విరుదునగర్ జిల్లా విజయకరిసల్‌కుళంలో మూడో విడత తవ్వకాల్లో బంగారు నాణెం బయల్పడిందని పురావస్తు పరిశోధకులు తెలిపారు. ఇదివరకే రెండు విడతలు చేపట్టిన తవ్వకాల్లో 2 వేలకు పైగా ప్రాచీన వస్తువులు బయల్పడ్డాయి. ఇటీవల ఈ ప్రాంతంలో చేపట్టిన మూడో విడత తవ్వకాల్లో బంగారు నాణెం లభించిందని, నాణెం ఒకవైపు ఆకులు, మరోవైపు చుక్కలు, గీతలున్నాయని పరిశోధకులు తెలిపారు.

కామాక్షి అమ్మన్ ఆలయంలో 2నుంచి నవరాత్రి ఉత్సవాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 29: కాంచీపురం కామాక్షి అమ్మన్ ఆలయంలో అక్టోబరు 2వ తేది నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. పురటాసి మాసంలో శరన్నవరాత్రి ఉత్సవాలు 10 రోజులు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉత్సవాలు బుధవారం ఉదయం పూర్వాంగ చండీ హోమంతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజు ఉదయం కామాక్షి అమ్మవారికి విశేష అభిషేక అలంకరణ, ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. రాత్రుల్లో నవరాత్రి మండపంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో కొలువుదీరనున్నారు. రాత్రి 7.30 గంటలకు సంగీత కచ్చేరీలు నిర్వహించనున్నారు. 8వ రోజైన 10వ తేది రాత్రి దుర్గాష్టమి, దుర్గ ఊరేగింపు, శూరసంహారం, 11వ తేది సరస్వతి పూజ, 12న విజయదశమి, నవవర్ణ పూర్తి, 13వ తేదీ రాత్రి సహస్ర కలశ స్థాపన జరుగనున్నాయి. 14వ తేది ఉదయం సహస్ర కలశాభిషేకం, రాత్రి ఊంజల్ పుష్ప కైంకర్యం నిర్వహించనున్నారు.

నీలగిరి జిల్లాలో భారీవర్షం

● ఈదురుగాలులకు కూలిన చెట్లు



కూలిన చెట్లు తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, సెప్టెంబరు 29: నీలగిరి జిల్లాలో శనివారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన భారీవర్షానికి పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన భారీవర్షాలు కురుస్తున్నాయి. నీలగిరి జిల్లా ఊటీ, కున్నూర్, కోతగిరి తదితర పర్యాటక ప్రాంతాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. కొడనాడులో అత్యధికంగా 80 మి.మీ వర్షం కురిసింది. ఇక, కున్నూర్‌లోని లైమ్‌రాక్, డాల్ఫిన్స్ వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద చెట్టు విరిగిపడడంతో 4 గంటలు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని కొమ్మలను తొలగించారు. భారీవర్షాల కారణంగా బాందుషై, బ్లాక్ బ్రిడ్జి ప్రాంతాల్లో తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ కార్మికులు మరమ్మతుల్లో నిమగ్నమయ్యారు.

ఘనంగా ఎస్ఆర్ఎం పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో నృత్యంతో అలరిస్తున్న విద్యార్థులు

ప్యారీస్, సెప్టెంబరు 29: నగరంలోని ఎస్ఆర్ఎం పబ్లిక్ పాఠశాల 8వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎస్ఆర్ఎం విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పారివేందర్, ప్రొ ఛాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణ పర్యవేక్షణలో సాగిన ఈ వేడుకల్లో విద్యార్థులను సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని ఆటపాటలతో అలరించారు. లైవ్ లవ్ విద్యాసంస్థ అధికారి డా.కన్నన్ గిరీష్ ప్రత్యేక అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు లౌకికజ్ఞానం గురించి శ్రద్ధగా నేర్చుకొని ఎదగాలని సూచించారు. ఎస్ఆర్ఎం విద్యాసంస్థలు విద్యతో పాటు సామాజిక సేవలను కూడా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.సుబ్రమణ్యం, మణిమంగై సత్యనారాయణ, డాక్టర్ కేఆర్ మాలతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిబిరం ప్రారంభం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు

వేలూరు, సెప్టెంబరు 29: స్థానిక కాట్పాడి ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలలో ఏడు రోజుల ఎన్‌సీసీ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ అధ్యక్షత వహించగా, వేలూరు కార్పొరేషన్ మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజ శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత పథక అధికారి అన్నపూర్ణి ఆహ్వానం పలుకగా, ఇండియా రెడ్‌క్రాస్ కాట్పాడి అధ్యక్షుడు జనార్దనన్, ఉప ప్రధానోపాధ్యాయుడు మారిముత్తు శిబిరం వివరాలు తెలియజేశారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు పాఠశాల ప్రాంగణాలను శుభ్రం చేయగా, పుష్పలత వారికి శిబిరానికి సంబంధించిన పుస్తకాలు అందజేశారు. ఉప పథక అధికారి కౌసల్య కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ యువజన విభాగం నిరసన

వేలూరు, సెప్టెంబరు 29: తిరుపతి లడ్డూ ప్రసాదం గురించి తప్పుగా మాట్లాడిన వారికి అరెస్ట్ చేయాలని కోరుతూ ఆదివారం హిందూ యువజన విభాగం ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. స్థానిక కాట్పాడి చిత్తూరు బస్టాండ్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆ విభాగం జిల్లా సెక్రటరీ లోకేశ్వరన్ కొబ్బరికాయలు కొట్టి ఆందోళన ప్రారంభించారు. ఆందోళనలో హిందూ వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా సెక్రటరీ గోపినాథన్, గుణశేఖరన్, జిల్లా కార్యకర్తల కమిటీ సభ్యుడు గోపి, సురేష్ తదితరులు కూడా కొబ్బరి కాయలు కొట్టి నిరసన తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 29: ఆనైకట్టు డివిజన్ సేకనూరు పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల వైద్యపరీక్షల శిబిరాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అలాగే, కార్మికులకు టీటీ ఇంజెక్షన్లు వేశారు. అనంతరం కలెక్టర్ కార్మికులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నందకుమార్, ఆనైకట్టు తహసీల్దార్ వేండా, డాక్టర్ జనసీ, శరణ్య, దిలీప్‌కుమార్, డివిజన్ ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు ఆరోగ్యనాథన్, ఆరోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యే బంగారు భవితకు పునాది

● అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు



ఎస్కేపీడీ హాస్టల్ విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న అజంతా శంకరరావు తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 29: బంగారు భవితకు క్రమశిక్షణతో కూడిన విద్య పునాదిలాంటిదని అజంతా గ్రూపు సంస్థల ఛైర్మన్ డాక్టర్ కని గెలుపుల శంకరరావు పేర్కొన్నారు. ఎస్కేపీడీ హాస్టల్ అల్యుమ్నీ ఆధ్వ ర్యంలో ఆదివారం నగరం లోని ఎస్కేపీడీ కన్వెన్షన్ సెంటర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమ్మేళనం నేత్రపర్వంగా సాగింది. ముఖ్యఅతిథిగా అజంతా శంకరరావు, గౌరవ అతిథిగా మన్నారు ఉదయకుమార్ పాల్గొని అసోసియేషన్ తరపున హాస్టల్ విద్యార్థులకు రూ.1.5 లక్షల విలువైన క్రీడా పరికరాలు విరాళంగా అందజేశారు. సంఘ అధ్యక్షుడు టి.జగదీష్ బాబు, పోషకులు ఎమ్కే రవీంద్రన్, కార్యదర్శి గుర్రం బాలాజి, కమిటీ సభ్యులు కె.గోపాలచెట్టి, ఎంఎ నరసింహన్, కె.రాముడు, వార్డన్ బద్రీనాథ్, ప్రముఖ వ్యాపారవేత్త కనిగెలుపుల రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి గరుడ సేవ కోసం 11 గొడుగులు

● చింతాద్రిపేట ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో టీయూసీ ట్రస్టీ శీలం వరదరాజులు బృందం

ప్యారీస్, సెప్టెంబరు 29: తిరుమల పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవం రోజున సమర్పించేందుకు చెన్నైలోని తిరుపతి అంబ్రిల్లా చారిటీస్ (టీయూసీ) ప్రత్యేకంగా 11 గొడుగులు సిద్ధం చేసింది. ఈ గొడుగులను వచ్చే అక్టోబరు 5వ తేదీన ఊరేగించి వాహనంలో తిరుమలకు తీసుకెళ్తారు. ఈ నేపథ్యంలో, ఆదివారం చింతాద్రిపేటలోని వేంకటేశ్వర పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేకంగా రూపొందించిన గొడుగులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. హారతి సమయంలో భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. టీయూసీ ట్రస్టీ శీలం వరదరాజులు మాట్లాడుతూ.... 147 ఏళ్లుగా తమ పూర్వీకులు వారసత్వ కైంకర్యంగా తిరుమల బ్రహ్మోత్సవాల గరుడ సేవకు గొడుగులు సమర్పించడం మహాభాగ్యమన్నారు.

సిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న అట్టకత్తి దినేష్‌గీతు

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని సిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినం సందర్భంగా ఆదివారం వేకువజాము ఐదు గంటలకు 'సిమ్స్ వాక్ ఫర్ హార్ట్' పేరుతో వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను ప్రముఖ సినీనటుడు అట్టకత్తి దినేష్ గీతు ప్రారంభించారు. సిమ్స్ హాస్పిటల్ నుంచి వీఆర్ మాల్ వరకు సాగిన ఈ వాకథాన్‌లో సుమారు ఐదువందల మంది పాల్గొన్నారు. సిమ్స్ హాస్పిటల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు శివసామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలను చూడటానికి ప్రజలకు గుండెనిబ్బరం అవసరం

● బీజేపీ ఎమ్మెల్యే వానతి శీనివాసన్ విమర్శ

చెన్నై, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో దశాబ్దాల తరబడి కొనసాగుతున్న వారసత్వ అవినీతి రాజకీయాలను చూడటానికి ప్రజలకు ఎంతో గుండె నిబ్బరం అవసరమని బీజేపీ ఎమ్మెల్యే వానతి శీనివాసన్ విమర్శించారు. కోయంబత్తూరులో ఆదివారం ఉదయం ఆమె మీడియాతోమాట్లాడుతూ ఉదయనిధి స్టాలిన్ ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించనుండటాన్ని గుండెదిటవు చేసుకున్నతర్వాతే శుభాకాంక్షలు తెలుపుతున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడనే అర్హత తప్ప ఉదయనిధికి వేరే ఏవైనా అర్హతలు ఉన్నాయా? అని ఆమె ప్రశ్నించారు. ఉదయనిధి పనులను చూసి ప్రజలే తగు నిర్ణయం తీసుకుంటారని, బెయిలుపై విడుదలైనవారిని మంత్రులుగా వెంటబెట్టుకుని నీతివంతమైన పరిపాలనను స్టాలిన్ ఎలా అందివ్వగలరని ఆమె ప్రశ్నించారు.

వైద్య ఉచిత శిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో డాక్టర్ కొల్లి రాజు

ప్యారీస్, సెప్టెంబరు 29: కాంచీపురం జిల్లా ఉత్తరమేరూర్ సమీపంలోని పాలేశ్వరంలో మద్రాసు ఆదిఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం (మాస్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మాస్ అధ్యక్షులు, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కొల్లి రాజు ప్రారంభించిన ఈ శిబిరంలో డా.మహేష్ కొల్లి, డాక్టర్ ఆగ్నేస్ జార్జ్, డాక్టర్ సంతోష కిషోర్ చంద్రశేఖర్, డాక్టర్ దివాకర్ తిరుపతిస్వామి, డాక్టర్ ఆర్.రాజశేఖరన్ సుమారు 116 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కారు ఢీకొని షుగర్ ఫ్యాక్టరీ కూలీ మృతి

మృతుడు రాష్ట్రవాసి

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 29: కారు ఢీకొని షుగర్ ఫ్యాక్టరీ కూలీ మృతి చెందాడు. ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలం ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీలో ఐవీపట్టికి చెందిన వేలు(65) కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా, అదే ఫ్యాక్టరీకి చెందిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చెన్నై ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సుమన్ ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు.

● ఒకే దేశం ఒకే ఎన్నికలు తప్పు


ఒకే కుటుంబ పాలన రైటా?

● తమిళిసై ఆగ్రహం

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం ఒకే ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న డీఎంకే నేతలు, మంత్రులు రాష్ట్రంలో ఒకే కుటుంబ పాలనకు ఎలా మద్దతిస్తున్నారని బీజేపీ నాయకురాలు, పుదుచ్చేరి మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంకే అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక రాజకీయాల్లో కొత్త ఘటాన్ని ఆవిష్కరించారని, మంత్రి ఉదయనిధిని ఉప ముఖ్యమంత్రిగా నియమించారని, అది డీఎంకే నిర్ణయం గనుక ఆ విషయంలో జోక్యంచేసుకోలేమన్నారు. అయితే ఒకే కుటుంబానికి చెందినవారే పాలనలో కీలకమైన పదవులు కలిగి ఉండాలా అని మాత్రమే ప్రశ్నిస్తున్నానని అన్నారు. డీఎంకేలో ఉదయనిధికంటే సీనియర్లు లేరా, దశాబ్దాల తరబడి పార్టీకి సేవ చేస్తున్నవారికి ఉన్నతమైన పదవులు ఇవ్వరా? అని ఆమె ప్రశ్నించారు. గత కొద్ది నెలలుగా డీఎంకే మంత్రులు, నాయకులు ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలంటూ అదే పనిగా ప్రతిచోటా ప్రకటనలు చేయడం... వాటికి మిత్రపక్షాల నాయకులంతా వత్తాసు పలకడం వింతగా ఉందన్నారు. అధికారంలో భాగస్వామ్యం అంటూ గగ్గోలు పెట్టిన డీపీఐ నేత తిరుమా కూడా ప్రస్తుతం మౌన ప్రేక్షకుడిగా మారారని తెలిపారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొన్ముడికి అటవీ శాఖనిచ్చి వనవాసానికి పంపారని యెద్దేవా చేశారు. సెంథిల్‌బాలాజీ యేడాదికి పైగా జైలువాసం గడిపి బెయిలుపై వస్తే ఆయనకు కీలకమైన శాఖలు కేటాయించి డీఎంకే పాలకులు తాము అవినీతిపరులకు అండగా ఉంటామని మరోమారు రుజువు చేశారన్నారు.

మంత్రివర్గంలో వన్నియర్లకు ప్రాధాన్యం లేదే?

● పీఎంకే అధినేత రాందాస్ విమర్శ



ప్యారీస్, సెప్టెంబరు 29: రాష్ట్ర మంత్రివర్గంలో వన్నియర్లకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ విమర్శించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని మంత్రివర్గంలో ఆదివారం జరిగిన మార్పులపై స్పందించిన రాందాస్... అన్ని వర్గాలు తమకు సమానమని చెబుతున్న డీఎంకే, మంత్రివర్గ నాటకం రక్తికట్టదన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక ఓటు బ్యాంక్ కలిగిన వన్నియర్, దళిత వర్గాలకు చెందిన ప్రజల ఓట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎంకే తమను గెలిపించిన ఈ రెండు వర్గాలను మోసం చేసిందన్నారు. డీఎంకేలో ఉన్న 131 మంది ప్రధాన నిర్వాహకుల్లో 23 మంది వన్నియర్ సామాజిక వర్గానికి చెందిన వారని, ఈ దామాషా ప్రకారం 34 మంది మంత్రుల్లో ఆరుగురికి మంత్రి పదవి రావాల్సి ఉందన్నారు. అదే విధంగా డీఎంకేలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన 21 మంది ఎమ్మెల్యేలున్నారని, వీరిలో ఐదుగురికి మంత్రి పదవి కల్పించాల్సి ఉండగా ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించి వారిని నిరాశకు గురిచేశారని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, మంత్రులుగా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి పార్టీలోను, ప్రభుత్వంలోను తగిన గుర్తింపు లేదని రాందాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి కమల్ సహా నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, సెప్టెంబరు 29: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఉదయనిధికి మక్కల్ నీదిమయ్యం అధినేత కమల్ సహా డీఎంకే మిత్రపక్షాల నేతలు, మంత్రులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై తన ఎక్స్ పేజీలో... రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రిగా సమర్థవంతంగా పనిచేసిన ఉదయనిధి ఉపముఖ్యమంత్రి పదవి చేపట్టడాన్ని కాంగ్రెస్ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు లబ్ధి కోసం తప్పకుండా పథకాలు తీసుకొస్తారని సెల్వపెరుందగై ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్, కొత్తగా మంత్రి పదవి చేపట్టిన సెంథిల్ బాలాజి, తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు, ప్రముఖ నటుడు ధనుష్, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తదితర ప్రముఖులు కూడా ఉదయనిధికి శుభాకాంక్షలు తెలియజేశారు.

చికిత్సలు ఫలించక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు మృతి

పెరంబూర్, సెప్టెంబరు 29: మేల్‌మలయనూరు తహసీల్దార్ కార్యాలయంలో నిప్పంటించుకున్న రైతు చికిత్సలు ఫలించక మృతి చెందారు. విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు సమీపం కొంగపురానికి చెందిన మోహన్‌రాజ్, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని పలువురు మేల్‌మలయ నూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ధనలక్ష్మి నేతృత్వంలో శుక్రవారం చర్చలు జరిగాయి. ఈ చర్చలు ఫలించకపోగా, తన స్థలాన్ని 23 మంది కబ్జాకు యత్నిస్తున్నారని లేఖ రాసిన మోహన్‌రాజ్, హఠాత్తుగా తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలు ఆర్పిన పోలీసులు తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా, అక్కడ చికిత్సలు ఫలించక శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొనసాగిన లంక నావికాదళం దాడులు

● 17 మంది రామేశ్వరం జాలర్ల అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 29: రాష్ట్ర జాలర్లకు చెందిన రెండు ఫైబర్ పడవలు స్వాధీనం చేసుకొని, వాటిలో ఉన్న 17 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి సుమారు 500 ఫైబర్ పడవల్లో సుమారు 3,000 మంది శనివారం చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున నెడుదీవి సమయంలో చేపల వేట సాగిస్తుండగా, సెల్వం, ఉదిర్త్‌రాజ్ తదితరులకు చెందిన రెండు పడవలు సరిహద్దులు దాటారంటూ లంక నావికాదళం చుట్టుముట్టింది. అనంతరం పడవల్లో ఉన్న జయస్టీఫెన్, రాజీవ్, వివేక్, ఇన్నాసి, సామువేలు, ప్రసన్న, భాస్కరన్, ఇరుదియనీజో, మారియ స్టెఫీన్, దురై, అరుళ్ దినకరన్, సురేష్, జీవన్ ఫ్రెషర్, మార్క్‌మిలన్, మిల్టన్, రేనాల్డ్, శేసురాజా తదితర 17 మంది జాలర్లను అరెస్ట్ చేసింది. అరెస్ట్ చేసిన జాలర్లను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించింది. కాగా, గత జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర జాలర్లకు చెందిన 55 పడవలు స్వాధీనం చేసుకొని, 413 మంది జాలర్లను లంక నావికాదళం అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో, లంక నావికాదళం దాడులను రాష్ట్ర జాలర్ల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. లంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.4.24 లక్షల స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 29: చెంగల్పట్టు జిల్లా గూడువాంజేరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు వచ్చే వారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా నగదు వసూలు చేస్తున్నట్లు పలువురు జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో, ఏసీబీ డీఎస్పీ శరవణన్ నేతృత్వంలోని అధికారుల బృందం ఈ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, లెక్కల్లో చూపని రూ.4.24 లక్షల నగదు స్వాధీనం చేసుకుంది. ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌ముత్తు, కార్యాలయ ఉద్యోగులను అధికారులు విచారిస్తున్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



ప్యారీస్, సెప్టెంబరు 29: స్థానిక షావుకారుపేట చిన్నతంబి మొదలి వీధిలో వేంకటేశ్వర తిరుమల పవిత్ర గొడుగుల 16వ వార్షికోత్సవాల సందర్భంగా శ్రీవారికి విశేష పూజలు, అన్నదానాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు టి.వెంకటరత్నం, పి.అశోక్‌కుమార్, సీహెచ్ సుబ్రమణ్యం, ఎమ్మెస్ మధు, వి.శ్రీనివాసులు, ఏటీ గుణ, అనిశెట్టి గున్నయ్య, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని వేదికపై కొలువుదీర్చి పుష్పాలు, సుగంధద్రవ్యాల మాలతో అలంకరించి హారతి పూజలు నిర్వహించారు. పూజారి జోలా ప్రసాదశర్మ నేతృత్వంలో జరిగిన పూజల్లో శ్రీవారికి ప్రత్యేకంగా తయారుచేసి నివేదించిన లడ్డూ ప్రసాదాన్ని జె.శ్రీనివాసులు కంపెనీ అధినేత శ్రీనాథ్ రూ.40 వేలకు దక్కించుకున్నారు. అనంతరం 2 వేల మందికి పైగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆ నాలుగు చిత్రాలపై భారీ అంచనాలు


● దీపావళికి సందడే సందడి



ఈ యేడాదిలో మరో మూడు నెలలు మాత్రమే మిగిలివున్నాయి. ఈ కాలంలో విడుదల కానున్న చిత్రాల్లో ప్రధానంగా నాలుగు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి. వీటిలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టయన్', శివకార్తికేయన్ 'అమరన్' దీపావళికి విడుదలకానున్నాయి. ఆ తర్వాత సూర్య నటించిన 'కంగువా', సూరి, విజయ్ సేతుపతి నటించిన 'విడుదలై-2' విడుదలవుతాయి. వీటితో పాటు మరికొన్ని చిన్నబడ్జెట్ చిత్రాలు వరుసలో ఉన్నాయి. అయితే, కమలహాసన్, విజయ్, అజిత్, ధనుష్, శింబు వంటి పెద్ద హీరోల చిత్రాలు ఈ దీపావళి రేసులో లేకపోవడం వారి అభిమానులను నిరుత్సాహానికి గురి చేస్తున్నాయి. వాస్తవానికి కమల్ 'థగ్‌లైఫ్', అజిత్ 'విడాముయర్చి' చిత్రాలు ఈ యేడాది విడుదలవుతాయని అభిమానులు భావించారు. కానీ, 2025 సంక్రాంతికి ఈ చిత్రాలు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

రజనీకాంత్ 'వేట్టయన్'...

'జై భీమ్' ఫేం టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజువారియర్, రితికా సింగ్, దుషార విజయన్, రోహిణి, రావు రమేష్ ప్రధాన తారాగణం. 'ఎన్‌కౌంటర్' నేపథ్యంలో రూపుదిద్దుకుంది. అయితే, ఈ సినిమా రజనీ హీరోయిజంకు, ఆయన సినీ కెరీర్‌కు ఏ మేరకు ఉపయోగపడుతుందన్నదే ప్రశ్నగా ఉంది. ఈ రెండు అంశాలుంటే మాత్రం సూపర్‌స్టార్ ఖాతాలో మరో బ్లాక్‌బస్టర్ హిట్ మూవీగా నిలిచిపోనుంది. అక్టోబరు 10న విడుదలయ్యే ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం. నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్, నిర్మాత సుభాస్కరన్.



సూర్య 'కంగువా'...

చిరుత్తై శివ దర్శకత్వంలో సూర్య, బాబీ డియోల్, దిశా పఠానీ తదితరులు నటించగా, ఏకంగా పదికిపైగా భాషల్లో రూపొందిన చిత్రం 'కంగువా'.నవంబరు 14న విడుదలకానుంది. నిజానికి అక్టోబరు 10నే విడుదల కావాల్సివుండగా, 'వేట్టయన్' కోసం సూర్య వెనక్కితగ్గారు. తమిళ చిత్రపరిశ్రమలో ఇటీవ చరిత్ర ఆధారంగా పలు చిత్రాలు తెరకెక్కుతున్నాయి. 'పొన్నియిన్ సెల్వన్-1, 2', 'తంగలాన్' ఈ కోవకు చెందిన చిత్రాలే. ఇపుడు 'కంగువా' రానుంది. భారీ బడ్జెట్‌తో నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా రూపొందించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా ఆదరణ పొందుతుందా? లేదా? వేచి చూడాల్సిందే. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చారు..



శివకార్తికేయన్ 'అమరన్'...

శత్రుదేశాల సైనికులతో యుద్ధం చేస్తూ వీరమరణం పొందిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించారు. 2017లో వచ్చిన 'రంగూన్' చిత్రానికి దర్శకత్వం వహించిన రాజ్‌కుమార్ పెరియస్వామి డైరెక్ట్ చేశారు. ముకుంద్ వరదరాజన్ పాత్రలో శివకార్తికేయన్ నటించారు. విశ్వనటుడు కమల్ నిర్మాతగా తెరకెక్కించారు. వీర మరణం పొందిన పలువురు సైనికుల జీవిత చరిత్ర, యథార్థ సంఘటనలు ఆధారంగా హిందీలో అనేక చిత్రాలు రాగా, అవన్నీ ఘనవిజయం సాధించాయి. ఈ కోవలో తమిళంలో వస్తున్న తొలి చిత్రంగా 'అమరన్' నిలిచింది. దీపావళి రేసులో ఉండే చిత్రాల్లో మొదటి వరుసలో ఈ మూవీ ఉంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.



అనిరుధ్ సరసన శ్రీలీల?

ప్రముఖ యువ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో కలిసి హీరోయిన్ శ్రీలీల నర్తించనున్నట్టు సమాచారం. తమిళం, తెలుగు భాషా చిత్రాలకు సంగీత స్వరాలను సమకూర్చుతూ ఎంతో బిజీగా ఉన్న అనిరుధ్... ఒక ఆల్బం సాంగ్‌ను రూపొందించనున్నారు. తాను సంగీతం సమకూర్చి నేపథ్యగానం చేసి, నటించనున్నారు. ఈ పాటలో తన సరసన నటించేందుకు శ్రీలీలను ఎంపిక చేసినట్టు సమాచారం. తెలుగులో వరుస అవకాశాలు చేజిక్కించుకుంటూ బిజీగా ఉన్న శ్రీలీల... కోలీవుడ్‌లోకి మాత్రం ఇంకా ఎంట్రీ ఇవ్వలేదు. అయితే, ఆమెను హీరోయిన్‌గా తీసుకునే ప్రయత్నాలు మాత్రం పలువురు దర్శక నిర్మాతలు చేస్తున్నారు.



సూరి - విజయ్ సేతుపతి 'విడుదలై-2'...

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వంలో గత యేడాది వచ్చిన 'విడుదలై' చిత్రానికి ఇది సీక్వెల్. మొదటి భాగం మన విజయం సాధించడంతో రెండో భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సూరి, విజయ్ సేతుపతి, మంజూ వారియర్, భవానీశ్రీ నటించారు. డిసెంబరు 20న విడుదలకానుంది. కొన్ని యథార్థ సంఘటనలను ఆధారంగా చేసుకుని తెరకెక్కించారు. ఇళయరాజా సంగీతం.

మరో 30 చిత్రాలకు అవకాశం...

చిత్రజ్యోతి

ఈ యేడాదిలో ఇప్పటివరకు సుమారు 170 చిత్రాలు విడుదలయ్యాయి. వచ్చే మూడు నెలల్లో మరో 30 వరకు విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. వీటితో కలుపుకుంటే ఈ యేడాది విడుదలయ్యే సినిమాల సంఖ్య 200 దాటొచ్చని భావిస్తున్నారు. అయితే, వీటిలో పెద్ద హీరోలు నటించిన చిత్రాల సంఖ్య మాత్రం కేవలం 20లోపే ఉండటం గమనార్హం.

దసరాకు సిద్ధమవుతున్న దుర్గామాత ప్రతిమలు



పెరంబూర్, సెప్టెంబరు 29: దేశవ్యాప్తంగా విజయదశమి వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఉత్సవాలకు టి.నగర్‌లో పలురకాల దుర్గా మాత ప్రతిమలు విక్రయాలకు సిద్ధమవుతున్నాయి. వెప్పేరి, షావుకారుపేట, గోపాలపురం, అయనావరం, టి.నగర్, వెస్ట్‌మాంబళం సహా పలు ప్రాంతాల్లో నివసిస్తున్న ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు విజయ దశమి ఉత్సవాలు కోలాహలంగా జరుపుకుంటారు. ఉత్సవాల్లో పలురకాలైన దుర్గ, కాళీమాతల విగ్రహాలు ఏర్పాటు చేసి శరన్నవరాత్రులు నిర్వహిస్తారు. చివరి రోజైన విజయదశమి రోజున ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి జలాశయాల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఈ ఉత్సవాల కోసం గతంలో ప్రతిమలను కోల్‌కాతానుంచి దిగుమతి చేసుకొనేవారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ నుంచే కార్మికులను చెన్నైకి రప్పించారు. టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోని తక్కర్ బాబా విద్యాలయంలో పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కార్మికులు నెలరోజులుగా ప్రతిమలు రూపొందిస్తున్నారు.



సిద్ధమవుతున్న ప్రతిమలు



తుదిరూపు దిద్దుకుంటున్న ప్రతిమలు



సంఘం అభివృద్ధికి సమష్టి కృషి

సీతారామనగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం



సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న కార్యదర్శి పాతూరి లక్ష్మణరావు

ప్యారీస్, సెప్టెంబరు 29: సంఘం అభివృద్ధికి సభ్యులందరూ సమష్టిగా కృషి చేయాలని కొడుంగైయూర్ సమీపంలోని సీతారామనగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం తీర్మానించింది. సీతారామనగర్‌లో ఉన్న సంఘ ప్రధాన కార్యాలయంలో ఆదివారం సంఘ 43వ సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షుడు బోడి సురేష్‌బాబు, కార్యదర్శి పాతూరి లక్ష్మణరావు, కోశాధికారి బి.పిచ్చేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్, ఆకం దుర్గా ప్రసాద్, సహ కార్యదర్శులు కె.శ్రీనివాస్‌కుమార్, బెల్లం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 2024వ సంవత్సరం టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 అందజేసి అభినందించారు. ఈ సమావేశం సభ్యుల సభ్యత్వ రుసుము రూ.600 నుంచి రూ.1,200కు పెంచుతూ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎర్రభనేని పట్టాభిరామయ్య, వంజరపు శివయ్య, విక్రమ్ ప్రసాద్ పాల్గొని విలువైన సూచనలు, సలహాలు అందించారు.



లడ్డూల అలంకారంతో వేంకటేశ్వరస్వామి

శ్రీవారికి 221 కిలోల లడ్డూలతో విశేష అలంకారం

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు అన్నదాన సమాజం ఆధ్వర్యంలో పురటాసి శనివార వేడుకల్లో భాగంగా వేంకటేశ్వరస్వామిని 221 కిలోల లడ్డూలతో అలంకరించారు. స్థానిక భక్తులు గతరెండు రోజులుగా లడ్డూల అలంకారంతో ఉన్న స్వామివారిని దర్శించేందుకు బారులు తీరారు. విష్ణుసహస్ర పారాయణం నిర్వహించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

బిర్యానీ ఆరగింపులో కేక!

● రాష్ట్రవ్యాప్తంగా భారీగా విక్రయాలు
● ఏడాదిలో రూ.11 వేల కోట్ల అమ్మకాలు
● ఒక్క చెన్నైలో మాత్రమే రూ.5,500 కోట్లు

పెరంబూర్, సెప్టెంబరు 29: 'బిర్యానీ'.. ఈ పేరు చెబితే ఎవరికైనా నోరూరాల్సిందే. మాంసాహార ప్రియులు ఇష్టంగా రుచిచూసే వంటకమది. మటన్, బిర్యానీ, చికెన్ 65, వంకాయ కుర్మా, డబుల్ కా మీఠా... ఈ కాంబినేషన్‌కు మరేదీ సాటిరాదని బిర్యానీ ప్రియులు చెబుతుంటారు. అందువల్లే మాంసాహార వంటకాలన్నింటిలో బిర్యానీ ముందంజలో ఉంటోంది మరి. విందులు, విశేషాలు, వివాహం సహా అన్ని శుభకార్యాల్లో బిర్యానీ ఉండాల్సిందే. అలాంటి బిర్యానీ విక్రయాలు ప్రస్తుతం ఊపందుకున్నాయి. బిర్యానీ హోటళ్లు ఎల్లప్పుడూ మాంసాహార ప్రియులతో కళకళలాడుతుంటాయి. మటన్, చికెన్ అనే రెండు రకాల్లో పలు రకాలుంటాయి. అంబూర్ బిర్యానీ, హైదరాబాద్ దం బిర్యానీ, దిండుగల్ తలపాకట్టి బిర్యానీ, సీరగసంబా బిర్యానీ, బాస్మతి బిర్యానీ, మొఘల్ బిర్యానీ వంటివి రాష్ట్రంలో ఫేమస్.



రోజురోజుకు బిర్యానీ ప్రియులు అధికం అవుతుండడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది.

ఏడాదికి రూ.11,000 కోట్లు...

రాష్ట్రంలో బిర్యానీ విక్రయాలు చేపట్టిన లైసెన్స్ పొందిన, పొందని హోటళ్లు, దుకాణాల ద్వారా ఏడాదికి రూ.11,000 కోట్ల వ్యాపారం సాగుతోంది. ఇందులో రాజధాని నగరం చెన్నైలో మాత్రమే ఏడాదికి జరిగే బిర్యానీ విక్రయాలు రూ.5,500 కోట్లు. యేటా 10 శాతం విక్రయాలు పెరుగుతున్నాయనేది సర్వేల్లో వెల్లడవుతోంది. ఇక, చెన్నై సహా పలు నగరాల్లో బిర్యానీ మాత్రమే విక్రయించేలా హోటళ్లు ఏర్పాటవుతున్నాయి. ఈ వ్యాపారాలపై భారత హోటళ్ల సంఘం చెన్నై విభాగం ఉపాధ్యక్షుడు ఆర్.బాలచందర్ మాట్లాడుతూ... పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తినే ఆహారం బిర్యానీ. బిర్యానీ కొనుగోలు చేస్తే సైడ్ డిష్ అవసరం లేకపోవడంతో అందరూ ఆసక్తి చూపుతున్నారన్నారు. పలు హోటళ్లలో కూడా మాంసాహార వంటకాల విక్రయాల్లో బిర్యానీదే అగ్రస్థానమని ఆయన తెలిపారు.



చెన్నైలో ఆహార పరిశ్రమ రూ.16,500 కోట్లు...

రాష్ట్రం మొత్తమ్మీద చెన్నైలోనే అధికంగా హోటళ్లున్నాయి. అధికారికంగా వాటి సంఖ్య 66,000. ఈ మేరకు అనుమతి పొందిన, పొందని హోటళ్లలో ఆహార పరిశ్రమ ఏడాదికి రూ.16,500 కోట్ల మేర వ్యాపారం సాగుతోంది. వాటిలో అనుమతి పొందిన హోటళ్ల వాటా రూ.15,600 కోట్లు. ఈ రెండు విభాగాల్లో బిర్యానీ విక్రయాలు ఏడాదికి రూ.5,500 కోట్లు. అందులో పేరుగాంచిన 25 హోటళ్లలో మాత్రమే రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. జాతీయస్థాయిలో ఆహార పరిశ్రమలో ఢిల్లీ ప్రథమస్థానంలో ఉంది. ముంబై, బెంగళూరు రెండు, మూడు స్థానాల్లో ఉండగా, చెన్నై నాల్గో స్థానంలో ఉంది. ఆయా నగరాల్లో ఒక వ్యక్తి హోటల్‌కు వెళ్తే చేసే ఖర్చు రూ.925 ఉండగా, చెన్నైలో రూ.845గా ఉన్నట్లు ఓ ప్రైవేటు సంస్థ చేసిన సర్వేలో వెల్లడైంది.

కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో హృదయ సంరక్షణపై చిత్రలేఖన పోటీలు

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో 'అర్ట్ బై హార్ట్' పేరుతో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు స్పందన లభించింది. హృదయ సంరక్షణ దినం సందర్భంగా ఈ పోటీలను ఆరేళ్ల వయస్సు పైబడినవారి కోసం నిర్వహించారు. హృదయ సంరక్షణపై మైం ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథిగా కళైమామణి ట్రోట్‌స్కీ మరుదు, కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కళైమామణి ట్రోట్‌స్కీ మరుదు, హాస్పిటల్ నిర్వాహకులు

ఏర్కాడులో పెరిగిన పర్యాటకుల రద్దీ

చెన్నై, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరుగడించిన పర్యాటక ప్రాంతం ఏర్కాడులో ప్రస్తుతం చల్లటి వాతావరణం కొనసాగుతుండటంతో వారాంతపు సెలవుల్లో ఆ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల రద్దీ ఉన్నట్టుండి పెరిగింది. శుక్రవారం రాత్రి నుంచే ఏర్కాడుకు వివిధ ప్రాంతాలనుంచి బస్సులు, వ్యాన్లలో, కార్లలో వందలాదిమంది పర్యాటకులు తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సందర్శనీయ ప్రాంతాలు లేడీస్ సీట్, అన్నాగార్డెన్, ట్యాంక్‌గార్డెన్, ఐందినై గార్డెన్, బోటానికల్ గార్డెన్, పకోడా పాయింట్లు కిటకిటలాడాయి. ఈ కారణంగా బోట్‌హౌస్, అన్నా గార్డెన్, ట్యాంక్ గార్డెన్, ఘాట్ ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా నడిచాయి. పర్యాటకులు తమ వాహనాలను ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.





పడవలపై సవారీ చేస్తున్న పర్యాటకులు - ఏర్కాడులో సందడి చేస్తున్న పర్యాటకులు

తేదీ మాత్రమే కాదు స్కాన్ చేసి అసెంబ్లీ నియోజకవర్గం తెలుసుకోవచ్చు!

వచ్చేస్తున్నాయ్ శివకాశి స్మార్ట్ క్యాలెండర్లు



కన్నియాకుమారి అసెంబ్లీ నియోజకవర్గం పేరుతో ఉన్న తేదీ

పెరంబూర్, సెప్టెంబరు 29: శివకాశిలో 2025 క్యాలెండర్ల తయారీ ముమ్మరంగా సాగుతోంది. రోజువారీ పంచాంగం సహా పలు రకాల క్యాలెండర్లు విక్రయానికి సిద్ధమవుతున్నాయి. ఆ క్రమంలో, 'తమిళనాడు 234 క్యాలెండర్' పేరుతో కొత్త క్యాలెండర్ మార్కెట్లో సందడి చేయనుంది. ఈ క్యాలెండర్‌లో రాష్ట్రంలోని శాసనసభ నియోజకవర్గాల వివరాలు తెలుసుకోవచ్చు. క్యాలెండర్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు ప్రత్యక్ష్యమవుతాయి. ఇలాంటి క్యాలెండర్లకు ఆదరణ బాగా ఉందని, ఇప్పటికే 40 శాతం ఆర్డర్లు వచ్చాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అదే సమయంలో కార్మికుల కొరత, విద్యుత్ ఛార్జీల పెంపు తదితర కారణాలతో క్యాలెండర్ ధరలు 5 నుంచి 8 శాతం పెరిగాయని, దినసరి క్యాలెండర్ నాణ్యత బట్టి రూ.15 నుంచి రూ.3,000 వరకు ధర ఉంటుందని వారు పేర్కొన్నారు.